కథ

# ప్రతినిధి

**మధ్యాహ్నం పన్నెండు దాటింది. జనవరి నెలైనా ఎండ చురుక్కుమంటోంది. ధనుర్మాసం కారణంగా అప్పటివరకు సందడిగా ఉన్న కోవెల మూసి, దక్షిణం, పళ్లు, కొబ్బరి చెక్కలు వంటి సరంజామా అంతా సంచీలో వేసుకొని చివరగా మరోసారి లక్ష్మీనారాయణునికి నమస్కరించి తాళాలు తన సహ అర్చకుడైన శర్మకి ఇచ్చి ఇంటికి బయలుదేరాడు రామశాస్త్రి.**

అతని పూర్వీకులు తరతరాలుగా ఆ కోవెలనే నమ్ముకోవడంతో అనువంశికంగా అతనికి లక్ష్మీనారాయణ గుడి ప్రధాన అర్చకత్వ పదవి లభించింది. తన తరువాత ఆ అవకాశం ఇతరులకి పోకూడదనే ఏడేళ్ల కొడుకు ఇష్టానికి వ్యతిరేకంగా వేదపాఠశాలలో చేర్పించి చదివిస్తున్నాడు. 'ప్చ్! విష్ణు ఎప్పటికి అందివస్తాడో, రేపు పెద్దపండుగ నాడు గుడిలో రష్ ఎక్కువగా ఉంటుంది. వాడిని సాయం తెచ్చుకుంటే నేను, శర్మ అర్చనలు చూసుకొన్నా, వాడు తీర్థప్రసాదాలు పంచడానికి పనికొస్తాడు' సాలోచనగా నడుస్తున్న రామశాస్త్రి "ఏం పూజారయ్యా! రాతి బొమ్మలకి మొక్కడమయ్యిందా? సంచీ నిండిందా?" వెక్కిరింతగా పలకరించాడు, ఎవరికో కైమా కొడుతున్న అబ్దుల్లా.

"ఒరేయ్... నీకు లక్షసార్లు ఎవరి మతం వాళ్లకి గొప్పదని చెప్పానా? మా దేవుడ్ని కించపరిస్తే మర్యాదగా ఉండదు" కోపంగా కసురుకొన్నాడు రామశాస్త్రి. "పోవయ్యా" నిర్లక్ష్యంగా నవ్వేశాడు అబ్దుల్లా.

"అరే చుప్! ఏందా వాగుడు" కొడుకుని కసిరి "ఏమీ అనుకోకు బాబు, ఏదో సిన్నోడు" వేడుకోలుగా అంది రెహనాబాయి.

అబ్దుల్లా తండ్రి ఎవరో బంధువులను కలిసేందుకు హైదరాబాద్ వెళ్లి దురదృష్టవశాత్తూ మతకలహాల్లో చనిపోయాడు. తన తండ్రిని చాందస హిందూ రామభక్తులే చంపేశారనే చేదునిజం అబ్దుల్లా పసి మనసులో నాటుకుపోయింది. అందుకే రామశాస్త్రిని చూసినప్పుడల్లా ఏదో ఒకటని వెక్కిరిస్తాడు. కొడుకును మందలిస్తూ అనుక్షణం సరిదిద్దుతూ ఉంటుంది అతని తల్లి రెహనాబాయి. ఇరవై ఏళ్ల అబ్దుల్లాతో తనకి అనునిత్యం జరిగే ఆ భాగోతానికి చిన్నగా నిట్టూర్చి ఇంటిదారి పట్టాడు రామశాస్త్రి. "వెధవకి వయసుతో బుద్ధి పెరగవలసినది పోయి పొగరు పెరుగుతోంది" తనలో తాను సణుక్కుంటూ ఇంటికి చేరాడు.

ఇంటికి చేరుతూనే పాతకాలపు చెక్క వాలుకుర్చీలో అలసటగా వాలిపోయాడు. "ఎండ ఎక్కువగా ఉందా?" సంచీ అందుకొంటూ సానుభూతిగా అడిగింది జానకి.

"ఆ ఫేన్ వేసి, కాసిని మంచినీళ్లియ్యి" అంగవస్త్రంతో చమట ఒత్తుకుంటూ అన్నాడు. ఫేను వేసి పెద్ద రాగిచెంబు నిండా నీళ్లతో వచ్చింది.

మూడొంతులు నీళ్లు తాగి చెంబు భార్యకిస్తూ "ఈమధ్య నాలుగు అడుగులు వేస్తేనే ఒళ్లంతా చమటలు పట్టి గుండెదడ పెరిగి ఆయాసం వస్తోంది. ఒకసారి రాజమండ్రి వెళ్లి పెద్ద హాస్పిటల్లో చూపించుకోవాలని ఆలోచిస్తున్నాను" చెప్పాడు.

జానకి మొహంలో ఆందోళన తొంగిచూసింది. "పట్టుమని నలభై ఏళ్లయినా లేవు అప్పుడే గుండెదడా, ఆయాసం వస్తుంటే ఇంకా ఆలోచించటం ఏమిటి? రేపే వెళ్లండి" కాస్త కంగారుగా అంది.

"ఏమిటి రేపా? గుడి ఎంత రష్‌గా ఉందో తెలుసా? శాస్త్రి, నేను ఇద్దరమున్నా చాలడం లేదు. పండగ నాలుగు రోజులు విష్ణుగాడిని సాయం తీసుకెళ్తే కాస్త తీర్థం పొయ్యడానికైనా ఆసరాగా ఉంటాడని నేను అనుకొంటుంటేను" విసుక్కున్నాడు.

"అలాగని ఆరోగ్యం పాడుచేసుకొంటారా?"

"ఈ ధనుర్మాసం గడిస్తే కాస్త భక్తుల సందడి తగ్గుతుంది. గుడిని శాస్త్రికి అప్పగించి నేను వెళ్లివస్తాను. అన్నం వడ్డించు, కాళ్లు కడుక్కొని వస్తాను" గుండెదడ కాస్త సద్దుకోవడంతో లేచి పెరట్లోకి నడిచాడు.

"విష్ణు తిని వెళ్లాడా?" చేద బావిలోకి వేస్తూ అడిగాడు.

"ఆ! రావడం, తినడం, సణగడం, వెళ్లడం అన్నీ అయ్యాయి" పీట వాల్చి అరటి ఆకు వేస్తూ అంది జానకి.

"ఏం సణిగాడేం?" మొహం, చేతులు తోముకుంటూ అడిగాడు.

"ఏముందీ పాత పాటే. నా ఫ్రెండ్స్ అంతా కాన్వెంట్లలో చదువుకుంటుంటే నేను పంచీ, పిలకతో వేదపాఠశాలలో వేదం చదువుకోవడం నామోషీగా ఉంది. నాన్నతో చెప్పు నేనూ ఇంగ్లీషు మీడియంలో చదువుతానని అంటూ నా బుర్ర తినేస్తున్నాడు" సాధింపుగా చెప్పింది. "ఏడిశాడు. చిన్నవెధవ. వాడికేం తెలుసు. నేనూ వాడిలాగే ఇంగ్లీషు చదువులని ఎగిరి బి.ఎ. వెలగబెట్టాను. ఏం వొరిగింది. ఎక్కడా సరైన ఉద్యోగం దొరక్క మళ్లీ మా నాన్న నేర్పిన వేదము, అర్చకత్వమే దిక్కయ్యింది. వేదాలు నేర్చుకోవడం అంత సామాన్యం అనుకున్నాడా? కోటి యజ్ఞాలు, వెయ్యి జన్మలు ఎత్తినా బ్రాహ్మణ జన్మ, వేద విద్యాయోగం కలుగవు. ఏదో మన అదృష్టం కొద్దీ ఆ వేదపాఠశాల మన ఊర్లో పెట్టారు కనుక తరతరాల కోవెల అర్చకత్వ వారసత్వం మనకుంది. కనుక మనవాడికి సులభంగా అందులో సీటు దొరికింది. అతి తెలివి ప్రదర్శిస్తే ఒళ్లు చీరేస్తాను" కాళ్లు తుడుచుకొని వచ్చి పీట మీద కూర్చుంటూ ఏడేళ్ల కొడుకు మీద ఎగిరాడు.

"బావుంది. మీ ధోరణి మీది. వాడి గోల వాడిది. మధ్య నేను చస్తున్నాను" నెయ్యి వడ్డిస్తూ విసుక్కొంది.

భర్త, కొడుకుల బాధ్యత తప్ప మరే సమస్యలు, అత్తమామలు, ఆడబిడ్డల పోరు లేని జానకి కొడుకు సమస్య కూడా భర్త నిర్ణయానికే వదిలేసింది.

★ ★ ★

బ్రహ్మముహూర్తం. తెల్లవారుఝాము ఐదుగంటల సమయం. రామశాస్త్రి అలవాటుగా గోదారిలో స్నానం ముగించి మెరిసేలా తోమిన ఇత్తడి బిందెతో మడినీళ్లు భుజానికి ఎత్తుకొని తిరుప్పావై చదువుతూ కోవెల మెట్లు ఎక్కసాగాడు.

ఎందుకో ఉదయం నుండి అతనిలో ఇదీ అని చెప్పలేని అలజడి రేగుతోంది. క్షణక్షణానికి గుండెపై వత్తిడి పెరుగుతున్నట్లు అయి తిరుప్పావై మరపుకు వస్తోంది. భుజం మీద బిందె మొయ్యలేనంత భారంగా మారి కళ్లముందు గజిబిజిగా అనిపిస్తుండగా కుడిచేత్తో గుండెను అదుముకుంటూ కిందకి వాలిపోయాడు. అతని ప్రమేయం లేకుండా బిందె జారిపోయింది.


★ ★ ★

అప్పుడే...

అబ్దుల్లా, అతని తమ్ముడు రహీం మర్నాడు సంతకి కావల్సిన మాంసం కోసం కోళ్లు, మేకలు కొనడానికి టౌన్‌కి వెళుతున్నారు.

"అరే భయ్యా! ఉదర్ దేకో, పూజారయ్య పడిపోతున్నాడు" కంగారుగా అన్నాడు. రహీం మాట కన్నా ముందే పరుగున వెళ్లి కిందపడకుండా శాస్త్రిని పట్టుకొన్నాడు అబ్దుల్లా. మనిషిని మనిషి ఆదుకోడానికి మానవత్వం ముందు మతం చిన్నబోయింది.

★ ★ ★



''డాక్టర్ గారూ, ఎలాగైనా నా అల్లుడిని బ్రతికించండి. మీ ఇంట్లో పెళ్లిళ్ల, నోములు, వ్రతాలు అన్నీ జీవితాంతం ఉచితంగా చేస్తాము'' బ్రతిమాలాడాడు జానకి తండ్రి పేరిశాస్త్రి.

అంత టెన్షన్‌లోనూ ఆ మాటలకి నవ్వొచ్చింది డాక్టర్ జోసెఫ్‌కు.

''శాస్త్రిగారూ, ఐయాం వెరీ సారీ టుసే, మీ అల్లుడికి గుండెజబ్బు బాగా ముదిరిపోయింది. టు బి ఫ్రాంక్, అతను బ్రతకడం చాలా కష్టం.

''గుండెజబ్బా! మా అల్లుడికి నలభై ఏళ్లు కూడా లేవు.''

''ఈ జబ్బుకి వయసుతో సంబంధం లేదండి.''

వింటున్న జానకి గభాలున వచ్చింది. ''ఆయనకి...ఆయనకి ఏ దురలవాట్లు లేవండి. కనీసం వక్కపొడి కూడా వేసుకోరు'' మీరు పొరపాటు పడ్డారన్నట్లు చెప్పింది. ఆయన విషాదంగా నవ్వారు. ''దురలవాట్ల వల్ల కాదమ్మా. గుండెజబ్బు పసిపిల్లలకి కూడా వస్తుంది. నిజం చెప్పాలంటే నీ భర్త వ్యాధి, చికిత్సకు ఆపరేషన్స్‌కు కూడా బాగయ్యే స్థితిలో లేదు.''

హతశురాలైనట్లు చూస్తుండిపోయింది జానకి.

''అలా అనొద్దు డాక్టర్. మరో మార్గం చూడండి. పచ్చని నా కూతురు ముఖాన్ని, ఈ పసివాడి మొహాన్ని చూసి చెప్పండి'' మనవడిని, కూతుర్ని చెరో చేత్తో డాక్టర్ ముందు నిలబెట్టి కన్నీళ్లతో ప్రాధేయపడ్డాడు పేరిశాస్త్రి.

తన రూమ్‌లోకి వెళ్లబోతున్న జోసెఫ్ కన్నీళ్లతో మలినమైన ఆ ముగ్గురి మొహాల్ని సాలోచనగా చూస్తూ నిలబడిపోయారు. ఆయన నోటినుండి వచ్చే సమాధానం కోసం ఆత్రంగా చూడసాగారు అందరూ.

''శాస్త్రిగారూ! అతని హార్ట్ పూర్తిగా చెడిపోయింది. ఇక మిగిలిన ఏకైక మార్గం హార్ట్ రీప్లాంటేషన్. అంటే చెడిపోయిన రామశాస్త్రి గుండెను తొలగించి ఆ ప్లేసులో మరో కొత్త గుండెను అమర్చడం. నిజానికి దానికి చాలా ఖర్చవుతుంది. కానీ నేను మీకో ఛాన్స్ ఇస్తున్నాను. మీరు ఎలాగైనా మీ అల్లుడి గ్రూప్‌కి మేచ్ అయ్యే హార్ట్‌ని సంపాదించగలిగితే, నేను మా హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి తక్కువ ఖర్చులో ఆపరేషన్ జరిగే ఏర్పాట్లు చేయగలను. ఆ తరువాత మీ ఇష్టం. ఇంతకుమించి ఓ డాక్టర్‌గా నేను చేయగలిగింది ఏమీలేదు'' జోసెఫ్ చెప్పారు.

''గుండెను మార్చి గుండెను అమర్చడమా? అసలది సాధ్యమయ్యే పనేనా?'' అయోమయంగా మొహాలు చూసుకున్నారు తండ్రీ కూతుళ్లు.

''ఓ అమ్మా! నే పోతున్నా! పూజారయ్యకి రక్తం కావాలంటే నాది సరిపోతుందంటే ఇచ్చినా. మళ్లా నువ్వు తురకోడివి, అంటరానోడివని గుస్సా చేస్తావని చెబుతున్నా'' మోచేతి నరాన్ని దూదితో వొత్తుకుంటూ వచ్చి గీరగా చెప్పాడు అబ్దుల్లా. వాళ్లు అతని మాటలు పట్టించుకోలేదు.

''నా గుండె పెట్టండి డాక్టర్‌గారు. ఆయన లేకపోతే నా బిడ్డ దిక్కులేనివాడు, అనాథ అయిపోతాడు'' ప్రాధేయపడింది జానకి.

**వి.ఎల్.పద్మసుందరి**

జోసెఫ్ చిన్నగా నవ్వారు. ''బ్రతికున్న మనిషి ప్రాణం తీసి గుండెను అమర్చటం సాధ్యం కాదమ్మా. రూల్స్ ఒప్పుకోవు. ఏవైనా స్వచ్ఛంద సంస్థల్ని కానీ, గవర్నమెంట్ హాస్పిటల్స్‌లోగానీ డోనర్స్ దొరుకుతారేమో ఎంక్వయిరీ చేయండి'' చెప్పి రూమ్‌లోకి వెళ్లిపోయారు.

తీవ్ర నిరాశకు గురైన జానకి విష్ణుని గుండెలకు హత్తుకొని హృదయ విదారకంగా రోదిస్తూ ఉండిపోయింది. వాళ్లతో ఉన్న వైరాన్ని మర్చిపోయి సానుభూతిగా చూస్తూ నిలబడిపోయారు అబ్దుల్లా, రహీం.

★★★

రామశాస్త్రి గ్రూప్ హార్ట్ డోనర్స్ కోసం తిరిగి తిరిగి విసిగి వేసారిన పేరిశాస్త్రిని పిలిచి అమృతం లాంటి వార్త చెప్పాడు డాక్టర్ జోసెఫ్. ''శాస్త్రి గారూ! మీ అల్లుడి గ్రూప్‌కి చెందిన డోనర్ దొరికాడు. నిన్న మా హాస్పిటల్‌కి వచ్చిన ఒక సీరియస్ ఏక్సిడెంట్ కేసుకు మీ గురించి చెబితే ఆఖరి క్షణా

ల్లోని ఆ వ్యక్తి తన ప్రాణాలు దారపోసి మీ అల్లుడిని బ్రతికించమన్నాడు. కంగ్రాట్స్. రేపే మీ అల్లుడి ఆపరేషన్'' చెప్పారు.

ఆనందంతో నోట మాట రాని పేరిశాస్త్రి మౌనంగా చేతులు జోడించాడు.

★ ★ ★

నెలరోజుల తరువాత...

చెడిపోయిన పాత గుండె స్థానంలో అమర్చబడిన కొత్త హృదయం పాతదాని స్థానాన్ని సంపూర్ణంగా ఆక్రమించి సక్రమంగా పనిచేస్తుంటే, అన్నాళ్ళ ఐ.సి.యు. గాజు గోడల నుండి మాత్రమే కనిపించి, కళ్లతో పలకరించి సంతృప్తి పొందుతున్న రామశాస్త్రి భార్యా బిడ్డలను తాకి పట్టలేని ఉద్వేగంతో ఆమె చేతుల్ని తన చెంపలకు అన్చుకున్నాడు, కళ్లనిండా నీళ్లతో.

''ఏం శాస్త్రి గారూ! ఏమంటోంది మీ కొత్త హృదయం'' పలకరించారు జోసెఫ్. గభాలున ఆయన కాళ్లమీద ఒరిగిపోయింది జానకి.

''ఛ. ఇదేమిటమ్మా లే!'' కంగారుగా లేవనెత్తారు డాక్టర్.

''వైద్యో నారాయణో హరిః- అనే పెద్దల మాటలు ఎంత సత్యమో నాకు తెలిసింది. నన్ను, నా బిడ్డను అనాథలు కాకుండా కాపాడిన మీరు నిజంగా దేముడే. మీ పేరు చెప్పి రోజూ నా ఇంట్లో దీపాన్ని వెలిగించుకుంటాను'' కృతజ్ఞతగా అంది.

జోసెఫ్ మృదువుగా నవ్వారు. ఆ నవ్వులో సంతోషం, గర్వం లేవు.

''నాదేం లేదమ్మా! ప్రభువు కృప. ఆ తల్లి త్యాగం నీ భర్తను బ్రతికించాయి. ఇరవై ఏళ్ల బిడ్డ బ్రతకడనే చేదునిజాన్ని దిగమింగి మరో బిడ్డను బ్రతికించడానికి తన బిడ్డ గుండెను దానమిచ్చిన ఆ మాతృమూర్తిది ఆ ఘనత'' అంటూ ఐ.సి.యు. బయట నిలబడి నీళ్లు నిండిన కళ్లతో రామశాస్త్రినే చూస్తున్న నలభై ఏళ్ల స్త్రీమూర్తిని చూపించారు.

అటు చూసిన అందరి కళ్లూ ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి.

''రెహనాబాయి'' ఆశ్చర్యంగా అంది జానకి.

కొంగు నోట్లో కుక్కుకుని రోధిస్తున్న ఆమెను విష్ణు లోనికి తీసుకొచ్చాడు. జానకిని కౌగిలించుకొని గుండె పగిలేలా ఏడవసాగింది.


''పూజారయ్యను ఆసుపత్రిలో చేర్చిన మర్నాడే ఒక చిన్న మేకపిల్లని కాపాడబోయి లారీ కింద పడిపోయాడు అబ్దుల్ భయ్యా. ఇదిగో ఈ దవాఖానాకే తెచ్చాం. బ్రతకడం కష్టమన్నారు డాక్టర్లు. ఆ సంగతి భయ్యాకి సమజయ్యింది. అమ్మి జాన్‌ని పిలిచి ''అమ్మి, అబ్బాజాన్ లేక నేను, రహీం ఎంత పరేషాన్ అయ్యామో నాకింకా యాదుంది. మాలా పూజారయ్య బేటా కాకూడదు. సచ్చిపోయిన వాళ్ల గుండె పెడితే పూజారయ్య బ్రతుకుతాడట. నా గుండె ఆ అయ్యకు పెట్టమను, అదే నా ఆఖరి ఖ్వారిష్ అని చెప్పాడు'' తల్లి వెనుక వచ్చిన రహీం కళ్లనీళ్లతో జరిగిన విషయం చెప్పాడు.

రామశాస్త్రి కళ్లముందు చురుకైన కళ్లతో చిరుగడ్డంతో, కనిపిస్తే వేళాకోళాలతో టీజ్ చేసే ఇరవై ఏళ్ల అబ్దుల్లా కదిలాడు. అప్రయత్నంగా అతని చెయ్యి కట్టు విప్పని గుండెను తడుముకొంది. నీళ్లు నిండిన కళ్లతో మెల్లగా లేచి రెహనా కాళ్లమీద వాలిపోయాడు.

''హే అల్లా! నిత్యం దైవం ఎదుట నిలబడి సేవలు చేసే సామివి. నా పాదాలు తాకుతావా?'' కంగారుగా వెనక్కి జరిగింది.

జోసెఫ్, రహీమ్ అతన్ని పైకి లేపారు.

''ఆ మాట అనొద్దమ్మా. ఇప్పుడు నేను కేవలం పూజారి రామశాస్త్రిని కాదు. ఈ గుండె నీ బిడ్డ అబ్దుల్లాది. అంటే ఇకపై నేను అబ్దుల్లాని కూడా. అంతే కాదమ్మా! ఈ శరీరంలో అబ్దుల్లా గుండె పొదిగి నాకు పునర్జీవితాన్ని ఇచ్చిన జోసెఫ్ సాక్షాత్తూ ఆ ప్రభువుకి ప్రతిరూపం. అందుకే నేను ఈ క్షణం నుండి నేను కులమతాల హద్దులు చెరిగిపోయిన సర్వమానవ సమానత్వానికి ప్రతినిధిని. మతాతీత మానవీయ వ్యక్తిని. నీ బిడ్డని!'' అంటూ చేతులు జోడించాడు. ★



## ఇచ్చిపుచ్చుకునేది

**ప్రేమ ఓ పవిత్రమైన భావన. అలాంటి ప్రేమ గురించి సినిమా తారలు అనేక రకాలైన నిర్వచనాలు ఇస్తారు. సునీల్ షెట్టి అయితే కొంచెం ఎమోషనల్‌గా మాట్లాడతాడు. 'ప్రేమ అనేది ఆషామాషీ వ్యవహారం కాదు. ప్రేమించాలన్నా, ప్రేమించబడాలన్నా ఎంతో నమ్మకం ఉండాలి. ఇచ్చిపుచ్చుకునేలా ఉండాలి. ఏ విషయమైనా ఉభయులు నమ్మకంతో ముందుకిసాగాలి. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు' అంటున్నాడు సునీల్‌షెట్టి.**